Fashion



## బార్బీ బొమ్మ.. చీర కట్టిందమ్మా

**సమంతను** ఇప్పుడెవరూ గ్లామర్ డాల్‌గా చూడటం లేదు. ఆత్మవిశ్వాస ప్రతీకగా ఆరాధిస్తున్నారు. సినిమాల జయాపజయాలకు అతీతంగా అభిమానిస్తున్నారు. పింక్ చీరకట్టులో, స్లీవ్‌లెస్ జాకెట్టుతో.. కనికట్టు చేస్తూ ఇన్‌స్టాలో ఆమె పోస్ట్ చేసిన ఫొటోలు సంచలనం సృష్టిస్తున్నాయి. బార్బీ బొమ్మను గుర్తుకు తెస్తున్నాయి.

## నవ్యానందం



**నవ్య నవేలీ నంద..** అమితాబ్ మనుమరాలు. అభిషేక్ మేనకోడలు. ఆమె నేతృత్వంలోని 'ప్రాజెక్ట్ నవేలీ' మహిళల విద్య, ఆర్థిక స్వాతంత్ర్యం తదితర అంశాలపై ప్రజల్లో చైతన్యం తీసుకొస్తున్నది. 'ఆరా' పేరుతో స్త్రీల ఆరోగ్యానికి సంబంధించిన స్టార్టప్‌ను స్థాపించారు నవ్య. తనకు ఇన్‌స్టాలో పదిలక్షల పైచిలుకు అభిమానులు ఉన్నారు. 'మహిళ విజయం కుటుంబం నుంచే మొదలవుతుంది. మా అమ్మ శ్వేత, అమ్మమ్మ జయా బచ్చన్ నన్ను ఏ వివక్షా తెలియకుండా పెంచారు. నన్ను నేను నిరూపించుకునే అవకాశాలు ఇచ్చారు. ఆంత్రప్రెన్యూర్‌షిప్ వైపు అడుగులు వేయించారు. చాలా మంది అమ్మాయిలకు కుటుంబసభ్యుల నుంచే మద్దతు దొరకడం లేదు' అంటారు నవ్య. 'నేను మరీ క్రమశిక్షణగా ఉండను కానీ, ఏ పని అయినా ఓ పద్ధతిగా జరగాలని కోరుకుంటాను' అంటూ నవ్వేస్తారు. బాలికలకు తమ శరీరం గురించి, సమాజం గురించి, ఆత్మరక్షణ పద్ధతుల గురించి తెలియజేయడానికి ఓ వినూత్నమైన మార్గాన్ని ఎంచుకున్నారు. కామిక్ బుక్స్ రూపంలో ఆ విషయాలను జనం ముందుకు తెచ్చారు. 'టింకిల్' పత్రిక సౌజన్యంతో ఓ ప్రత్యేక సంచిక ఆవిష్కరించారు.

**ఆమె పేరు చాలామందికి తెలియకపోవచ్చు. కానీ, ఆమె ప్రభావితం చేయని పల్లె లేదు. ఆమెను తలుచుకోని రైతు ఉండడు. తెలంగాణలో అధికంగా పండే వరి వంగడం ఆమె నేతృత్వంలో ఆవిష్కారమైనదే. పప్పు, నువ్వులు, మక్కలు, జీలుగు, జనుము.. పంటలకు సంబంధించి కూడా అనేక వంగడాలు అభివృద్ధి చేశారు. నర్సాపూర్ అగ్రికల్చర్ రీసెర్చ్ స్టేషన్ హెడ్ డాక్టర్ శోభారాణి కలల పంటల గురించి ఆమె మాటల్లోనే..**



# రైతుకు రొక్కం.. చేనుకు శోభ!



**మా** నాన్న భద్రయ్య హెడ్ మాస్టర్. సొంతూరు కరీంనగర్ జిల్లా చొప్పదండిలో మాకు యాభై ఎకరాల సేద్యం ఉంది. కూలీలు ఉన్నా కుటుంబ సభ్యులు కూడా కష్టపడక తప్పదు. చదువుకునే రోజుల్లో నేనూ పొలానికి వెళ్లేదాన్ని. అప్పట్లో ఇన్ని పనిముట్లు లేవు. ఇన్నిన్ని వంగడాలు లేవు. నేను హైదరాబాద్‌లోని రెడ్డి ఉమెన్స్ కాలేజీలో ఇంటర్ చదివాను. అప్పట్లో హైదరాబాద్‌లో మత ఘర్షణల వల్ల చాలా రోజులు కాలేజ్ మూసేశారు. క్లాసులు సక్రమంగా జరిగేవి కాదు. దీంతో ఎంసెట్ సరిగా రాయలేకపోయాను. చదివితే వ్యవసాయ శాస్త్రమే చదవాలనే పట్టుదలతో డిగ్రీలో చేరలేదు. ఎంసెట్ రెండో ప్రయత్నంలో మంచి ర్యాంక్ వచ్చింది. బీఎస్సీ (అగ్రికల్చర్)లో చేరాను. రెండో సంవత్సంలో ప్లాంట్ బ్రీడింగ్ పరిచయమైంది. కొత్త వంగడాల గురించి ఇందులో ఉంటుంది. పీజీలో ప్లాంట్ బ్రీడింగ్ చదవాలంటే ఎంట్రన్స్‌లో మంచి ర్యాంక్ రావాలి. అందుకే పట్టుదలగా చదివాను. ఫస్ట్ ర్యాంక్ సాధించాను. ఎమ్మెస్సీలో ప్లాంట్ బ్రీడింగ్ స్పెషలైజేషన్ చేశాను. సీఎస్ఐఆర్ జేఆర్ఎఫ్ రీసెర్చ్ ఫెలోషిప్ వచ్చింది. ధార్వాడ్‌లోని యూనివర్సిటీ ఆఫ్ అగ్రికల్చర్ సైన్సెస్‌లో చేరాను. పొద్దుతిరుగుడు పంటలో పేరెంటల్ లైన్స్ (ఆడ, మగ) సాగు మీద పరిశోధన చేశాను. మూడేళ్లలోనే పీహెచ్‌డీ పట్టా సాధించాను.

### వరంగల్ కంది

పీహెచ్‌డీ పూర్తికాగానే మండల వ్యవసాయ అధికారిగా ఉద్యోగం వచ్చింది. మూడేళ్ల తర్వాత ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో సైంటిస్ట్ కొలువు వరించింది. నన్ను ప్రత్యేక బాధ్యతలతో వరంగల్‌లోని రీజినల్ అగ్రికల్చర్ రీసెర్చ్ స్టేషన్‌కు పంపారు. అప్పట్లో ఇంత నీటి లభ్యత లేదు. ఆరుతడి పంటలే ఎక్కువ. కంది చేలు వైరస్‌ను తట్టుకోలేక పోయేవి. తక్కువ దిగుబడి పంటలనే రైతులు సాగు చేసేవారు. అధిక రాబడినిచ్చే, వైరస్ తెగుళ్లను తట్టుకునే కొత్తరకం వంగడాలపై అక్కడ పరిశోధన జరిగేది. నేనూ భాగస్వామిని అయ్యాను. డబ్ల్యూఆర్‌జీఈ93, డబ్ల్యూఆర్‌జీఈ97, డబ్ల్యూఆర్‌జీ255 వంగడాలను అభివృద్ధి చేశాం. తెలంగాణ రైతులు అత్యధికంగా సాగు చేస్తున్నది ఈ కంది వంగడాలనే. ఆపైన కరీంనగర్‌లోని మొక్కజొన్న పరిశోధనా స్థానానికి బదిలీ అయ్యాను. ఇక్కడ ఎండు తెగులును తట్టుకునే హైబ్రిడ్ మొక్కజొన్న కేఎన్ఎంహెచ్4010131, యాసంగిలో తక్కువ కాలంలో దిగుబడి నిచ్చే కేఎన్ఎంహెచ్ 4010141 పేరెంటల్ లైన్స్‌ని అభివృద్ధి చేశాం.

### నెంబర్ వన్ సీడ్

పొలాసలోని రీజినల్ అగ్రికల్చర్ రీసెర్చ్ సెంటర్‌లో అసోసియేట్ బ్రీడర్‌గా వరి వంగడాలపై పరిశోధన చేశాను. ఉల్లికోడు పురుగు వల్ల ఎక్కువగా నష్టపోతున్నామని రైతులు చెప్పారు. ఈ సమస్యకు పరిష్కారంగా తక్కువ వ్యయంతో, అధిక లాభాలిచ్చేలా కొత్త వంగడాల రూపకల్పనకు పూనుకున్నది మా బృందం. రెండేళ్లు కష్టపడి 'ప్రద్యుమ్న' రకం తయారు చేశాం. ఇది తక్కువ కాల పరిమితిలో మంచి దిగుబడిని ఇస్తుంది. వానకాలం, యాసంగి పంటగా వేసుకోవచ్చు. ఉల్లికోడును తట్టుకుని అధిక దిగుబడినిచ్చే 'బతుకమ్మ' రకం వరి వంగడాన్నీ మేమే అభివృద్ధి చేశాం. సన్న వడ్లలో 'జేజీఎల్ 24423' రకం వంగడాన్ని అభివృద్ధి చేశాం. ఈ రకం వరిని సాగు చేస్తే మొక్క పడిపోదు. గింజ రాలిపోదు. సన్న వడ్లలో అధిక దిగుబడినిచ్చే 'కేఎన్ఎం1638' వంగడాన్నీ అభివృద్ధి చేశాం. మన రైతుల ప్రాధాన్యం ఈ వరి వంగడాలే. తెలంగాణలో సాగు అవుతున్న వరిలో కేఎన్ఎం1638, జేజీఎల్24423లే ఎక్కువ.



### బ్రీడ్ లీడర్

అయిదేళ్ల క్రితం.. నర్సాపూర్ అగ్రికల్చర్ రీసెర్చ్ స్టేషన్‌కు సీనియర్ సైంటిస్ట్‌గా బదిలీ అయ్యాను. ఇక్కడ ఆగ్రో ఫారెస్ట్రీలో రీసెర్చ్ చేస్తున్నాను. ప్లై ఉడ్ పరిశ్రమ దేశంలో శరవేగంగా ఎదుగుతున్నది. ఆ కంపెనీలకు కావాల్సిన చెక్క మన దగ్గర అందుబాటులో లేదు. మన వేప ఉద్యాన సాగుకు అనువైంది కాదు. కొమ్మలు ఎక్కువగా ఉండటం వల్ల దిగుబడి తగ్గుతుంది. కొమ్మలు కత్తిరించడం రైతుకు సమస్యే. వీటిని అధిగమించేందుకు మలబార్ వేపతో ఎన్‌టీపీఎంబీ01 అనే మ్యూటెంట్ (ఉత్పరివర్తనం చెందించిన) వేపను అభివృద్ధి చేశాను. ఈ వేపచెట్టు నిలువుగా పెరుగుతుంది. కొమ్మలు వాటంతట అవే రాలిపోతాయి. తెలంగాణలో ఉద్యాన పంటలు పెరుగుతున్నాయి. టమాట, వంగ లాంటి మొక్కల పెంపకానికి ఊతంగా నిలువు కర్రల సాయం అవసరం అవుతుంది. ఇప్పటి వరకు మన రైతులకు ఈ సమస్యపై అవగాహన లేదు. భవిష్యత్ అవసరాల కోసం దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి సేకరించిన పద్దెనిమిది వెదురు జాతులను నర్సాపూర్ అగ్రికల్చర్ రీసెర్చ్ స్టేషన్‌లో పెంచుతున్నాం. ఉద్యాన పంటల సాగులో వీటి ఉపయోగాన్ని అధ్యయనం చేస్తున్నాం. భవిష్యత్ అవసరాల కోసం టిష్యూ కల్చర్ ద్వారా కొత్తరకం వెదురు మొక్కను అభివృద్ధి చేసే పనిలో ఉన్నాను. తెలంగాణ రైతులకు ఇది మా కానుక.

...✍ నాగవర్ధన్ రాయల

📷 గడసంతల శ్రీనివాస్

# కలవరమాయే..

నాకు మూడేండ్ల క్రితం పెండ్లయింది. మా వారు వ్యాపారవేత్త. ఇంకా పిల్లలు లేరు. ఆయన బిజినెస్ పనుల మీద తరచూ టూర్స్ వెళ్తుంటారు. నెలకు ఇరవై రోజులు ఇంట్లోనే ఉండరు. మిగతా పది రోజులు కూడా బిజీ బిజీ. మా ఆయన ప్రాణ స్నేహితుడు తరచూ మా ఇంటికి వస్తుంటాడు. బయటి పనుల్లో సాయం చేస్తుంటాడు. ఒంటరితనాన్ని భరించలేక తనతో ఫోన్‌లో మాట్లాడుతుంటాను. అప్పుడప్పుడూ ఏ రెస్టారెంట్‌కో తీసుకెళ్తాడు. అల్లరి చేస్తాడు. తెగ నవ్విస్తాడు. ప్రత్యేక సందర్భాల్లో కానుకలూ ఇస్తుంటాడు. దీంతో కొంత సామీప్యం పెరిగింది. ఈ విషయాలేవీ మా ఆయనకు తెలియవు. మావారు ఎదురుగా ఉన్నప్పుడు మాత్రం నన్ను 'బాబీ.. బాబీ' అని పిలుస్తుంటాడు. ఆ నటన చూసి నవ్వు ఆపుకోలేక పోతాను. అతనితో పడక పంచుకున్నట్టు ఈమధ్య కల వచ్చింది. అప్పటి నుంచీ చాలా ఆందోళనగా అనిపిస్తున్నది. నేను చేస్తున్నది తప్పా? అతణ్ని దూరం పెట్టాలా?

• ఓ పాఠకురాలు


**మీ** ప్రశ్నలోనే సమాధానం ఉంది. మీ వివరణలోనే కొంత పశ్చాత్తాపం కనిపిస్తున్నది. మీ ఆయన ప్రాణ స్నేహితుడంటూ ఆ వ్యక్తిని పరిచయం చేస్తున్నారు. ప్రాణ స్నేహితులెవరూ ఈ తరహా చనువు తీసుకోరు. ఇదంతా కేవలం ఆకర్షణే. ఖాళీ బుర్ర దయ్యాల కార్ఖానా అంటారు. ఏ పనీ లేకపోవడం, ఏ బాధ్యతా తీసుకోకపోవడం వల్ల మీ ఆలోచనలు పక్కదారి పడుతున్నాయి. మీ ఒంటరితనమే మీ శత్రువుగా మారుతున్నది. మీరు ఉంటున్న ఖరీదైన ఫ్లాట్, మీరు ధరిస్తున్న బ్రాండెడ్ దుస్తులు, మీరు షికారుకు తీసుకెళ్లే కారు.. అన్నీ మీ ఆయన కష్టార్జితమే. మీ భర్త గురించి మీరు ఎలాంటి ఫిర్యాదూ చేయలేదు. అంటే, మంచివాడనే కదా అర్థం. ఆ మంచితనాన్ని అలుసుగా తీసుకోవద్దు. మీకు, మీ వారికి మధ్య చిన్నపాటి అగాథం ఏర్పడిన మాట నిజమే. దాన్ని సరిచేసుకోండి. ఈ విషయంలో మీరు ఇంకొంత చొరవ చూపండి. అతను ఇంట్లో ఉన్నప్పుడు.. మనసు విప్పి మాట్లాడండి. టూర్‌లో ఉన్నప్పుడు.. ఫోన్ చేసి పలకరించండి. 'మీరు దూరంగా ఉన్నా సరే.. నా మనసుకు మాత్రం దగ్గరలోనే ఉన్నారు' అనే భావన కలిగించండి. మీ బంధం తప్పక బలపడుతుంది. ఆ పిచ్చి కల గురించి ఆందోళన చెందాల్సిన పన్లేదు. మనసులో ఏ మూలనో ఉన్న ఆలోచనకు అదో దృశ్యరూపం. బుర్రలోంచి తుడిచేయండి. ఆ వ్యక్తి మీ వారి ముందే కాదు, మీ ముందు కూడా నటిస్తున్నాడేమో? జాగ్రత్త.

డియర్ జిందగీ



# ఒకటి కాదు.. రెండు!


నగ ధగలు





**ఒక వేలికి పెట్టుకుంటే మాత్రం ఒకటే ఉండాలని రూలేముంది? అలా అని, రెండూ వేరువేరు ఉంగరాలు కావాలన్న నియమమూ లేదు. అందుకే అమ్మాయిలూ అబ్బాయిల్లా విడివిడిగా ఉన్నా.. ప్రేమికుల మనసుల్లా ఒకటిగా పెనవేసుకునే అంగుళీకాలు వస్తున్నాయి. గొలుసులతో జతయ్యే ఈ జోడు ఉంగరాలు 'లింక్డ్ చైన్ రింగ్స్' పేరిట ఫ్యాషన్‌గా మారాయి!**







**ప్రేమ** కానుకల్లో ముందువరుసలో నిలిచేది ఉంగరాలే. 'నిను డైమండ్ రింగై రమ్మంది నా టెండర్ ఫింగరే'.. అంటూ పాటలూ అల్లేస్తున్నారు. అందుకే, అంగుళీకాల్లో ఎన్నడూలేనన్ని వెరైటీలను మన్నికగా తయారు చేస్తున్నారు డిజైనర్లు. ప్రియమైన వారి ముఖంలానే.. ఒక్కసారి చూస్తే వందసార్లు తలచుకునేంత ప్రత్యేకంగానూ రూపొందిస్తున్నారు. ఈ జోడు ఉంగరాలను 'లింక్డ్ చైన్ రింగ్స్', 'కనెక్టెడ్ చైన్ రింగ్స్' అని పిలుస్తున్నారు. ఇందులో రెండు ఉంగరాలు సన్నని చైన్లతో అనుసంధానమై ఉంటాయి. రెండూ ఒకే డిజైన్‌తో వచ్చే వాటితో పాటు, ఒకదానికొకటి మ్యాచింగ్‌గా ఉంటూ వేరువేరు డిజైన్లతో తయారవుతున్నవీ ఉన్నాయి. సాదాగా ఉండేవి, రకరకాల రాళ్లు పొదిగినవే కాదు.. నాజూగ్గా, ఘనంగా కనిపించేవీ ఉన్నాయి. బంగారం, రోజ్‌గోల్డ్, స్టెర్లింగ్ సిల్వర్, ఫ్యాన్సీ రకాల్లోనూ వస్తున్నాయి. వివిధ సైజుల్లో దొరికే వీటిని అడ్జస్టబుల్ మాడల్స్‌లోనూ కొనుక్కోవచ్చు. ఒకే వేలికి రెండు ఉంగరాలు తొడుక్కోవచ్చు. ఉంగరం అంటే వేలి మొదట్లోనే ఎందుకు ఉండాలి, చివరనా పెట్టుకోవచ్చు. నలుగురిలో ప్రత్యేకంగా కనిపించవచ్చు! ఏకాంతంలో ఉన్నప్పుడు మాత్రం 'ఇవి రెండూ నువ్వూ నేనూ' అనుకుంటూ మురిసిపోనూవచ్చు!

## అచ్చం అమ్మ చేయిలా..



**అమ్మ** అరచేయి పొట్ట మీద జోకొడుతుంటేనే బుజ్జి పాప నిద్రపోయేది. ఆ చేయి పక్కకు జరిగిందో నిద్రలేచే పిల్లలు ఎందరో. కానీ ఎంత సేపని చేయి తీయకుండా కూర్చోగలం. అలాంటి సందర్భాల్లో చక్కగా ఉపయోగపడేలా 'బేబీ స్లీప్ సూతింగ్ పామ్ పిల్లోస్' దొరుకుతున్నాయి. ఇవి అచ్చంగా నూలుతో చేసినవి. మనుషుల చేతిని పోలి ఉంటాయి. అంతేకాదు, మీద చేయి వేసినట్టే అనిపించేందుకు కాస్త బరువు జోడించి రూపొందిస్తున్నారు. అందువల్ల ఈ 'చేయి దిండు'ను పాపాయి మీద ఉంచితే తన మీద ఎవరో చేయి వేసుకుని పడుకున్న అనుభూతిని పొందుతారు. హాయిగా నిద్రపోతారు. జాకీ అనే మరో సంస్థ కూడా జాకీ హగ్ పేరిట ఈ తరహాలో పిల్లలను చుట్టేసేలా.. చేతులను పోలిన దిండ్లను తయారు చేస్తున్నది. ఇవి కూడా బిడ్డలను నిద్రపుచ్చడానికి పనికొస్తాయి. వీటితో ఇటు అమ్మ ఎంచక్కా పనిచేసుకోవచ్చు, పాపాయి హాయిగా బజ్జోవచ్చు. ఐడియా అదిరింది కదూ!



